2వ అధ్యాయం

# సముచితమైన ఆరంభం

బైబిలుపరంగా చెప్పాలంటే ఒక శిష్యుడనేవాడు ప్రభువైన యేసు క్రీస్తును పూర్తిగా విశ్వసించుతాడు, అతడు ఆయన వాక్యమునందు జీవిస్తూ తద్వారా పాపమునుండి స్వతంత్రుడవుతాడు. శిష్యుడనేవాడు క్రీస్తు ఆజ్ఞలన్నిటిని పాటిస్తాడు మరియు తన సొంత కుటుంబముకన్నా, సుఖంకన్నా మరియు తన యావదాస్తులకన్న మిన్నగా యేసును ప్రేమిస్తాడు. ఆదేవిధంగా తన జీవనవిధానం ద్వారకూడ ఆ ప్రేమను వ్యక్తపరుస్తుంటాడు. నిజమైన శిష్యులు ఒకరినొకరు ప్రేమిస్తారు మరియు ఆ ప్రేమను ఆచరణలో పెట్టి చూపిస్తారు. అంతేకాక వారు బహుగా ఫలిస్తారు.[2] యేసు కోరుకునేది ఇటువంటి శిష్యులనే.

అదేవిధంగా ఆయన శిష్యులుకాని వారు ఇతరులను ఆయన శిష్యులుగా చేయలేరు. కాబట్టి మనం ఎవరినైన ఆయన శిష్యులుగా చేయుటకు ప్రయత్నించక ముందు, మొదట మనం ఆయన శిష్యులుగా మారాలి. దైవసేవకులు, శిష్యులనగా ఎవరు అన్న అంశం గూర్చి బైబిలు పరమైన నిర్వచనమునకు వ్యతిరేకంగా చెబుతున్నట్లయితే వారు తప్పుచేసిన వారవుతారు. అటువంటివారు నిజమైన శిష్యులను తయారు చేస్తారు అని ఆశించలేము. వాస్తవంగా చెప్పాలంటే వారు కనీసం ఆ దిశగా ప్రయత్నం కూడ చేయరు. శిష్యులను తయారుచేయటంలో ఎదురయ్యే కష్టాలను తట్టుకోలేరు, ఆ కారణంగా యేసుక్రీస్తుకు సంపూర్ణంగా సమర్పించుకున్నవారు కారు.

దీనిని బట్టి సేవకులు ఎవరైతే చదవటం కొనసాగిస్తారో వారు ప్రభువైన యేసు క్రీస్తుకు నిజమైన శిష్యులని మరియు ఆయన ఆజ్ఞలన్నిటిని పాటించుటకు తమ్మును తాము సమర్పించుకున్నవారని భావిస్తాను. నీవు ఆయన శిష్యుడవు కానిచో, ఇకనైన ఆయనకు నిజమైన శిష్యుడిగా మారాలి అన్న నిర్ధారణకు వచ్చేవరకు నీవు ఆపై ఎంత చదివినా అర్థం ఉండదు. ఇక ఆలస్యం చేయకు వెంటనే మోకాళ్ళూని పశ్చాత్తాపంతో ప్రార్థించు! దేవుడు తన అద్వితీయమైన కృపచేత నిన్ను క్షమించి, క్రీస్తునందు నూతన సృష్టిగా చేస్తాడు.

## శిష్యత్వమును గూర్చిన పున: పరిశీలన

శిష్యుడనగా ఎవరు అన్న దానిని గూర్చి యేసు ఎంతో స్పష్టంగా చెప్పినప్పటికీ, అనేకులు ఆయన ఇచ్చిన నిర్వచనానికి బదులుగా తమ సొంత నిర్వచనాలను ఇస్తుంటారు. ఉదాహరణకు క్రైస్తవులమని చెప్పుకునే కొందరికి ***శిష్యుడనే*** మాటకు సరైన అర్థం తెలియదు. వారి విషయంలో ***శిష్యుడన్న*** మాటకు బైబిలు పరమైన అర్థం తొలగిపోయింది.

పరలోక సంబంధ విశ్వాసులు ***శిష్యత్వం*** అనునది తమ ఇష్టపూర్వకంగా తీసుకునే

---

[2] ఈ నిర్వచనం మత్తయి 28:18-20, యోహాను 8:31-32; 13:25, 15:8 మరియు లూకా 14:25-33 చూడగలము.

రెండవ నిర్ణయం అని భావిస్తారు. ఒకడు క్రీస్తుకు శిష్యుడిగా కాక క్రీస్తునందు పరలోక సంబంధ విశ్వాసిగా ఉండగలడు అనివారు అభిప్రాయపడుతుంటారు! లేఖనములలో వ్రాయబడిన విధంగా, శిష్యత్వమును గూర్చి యేసు కోరుకునే లక్షణాలను త్రోసి పుచ్చడం చాలా కష్టతరం. క్రైస్తవులలో రెండు వర్గాలు ఉన్నాయి అని చెప్పబడుతోంది. యేసునందు విశ్వాస ముంచు విశ్వాసులు ఒక వర్గమునకు చెందిన వారు మరియు యేసునందు విశ్వాసముంచి ఆయనకు సమర్పించుకున్న శిష్యులు రెండవ వర్గానికి చెందిన వారు. విశ్వాసులు ఎందరో ఉన్నారు కాని శిష్యులే కొద్దిగా ఉన్నారు. అయితే ఇద్దరూ పరలోకానికి వెళతారు అని కూడ చెప్పబడుతోంది.

ఈ విరుద్ధమైన సిద్ధాంతం, శిష్యులను చేయమని చెప్పిన క్రీస్తు ఆదేశాన్ని నిష్ప్రయోజనం చేస్తోంది. తద్వార శిష్యులను తయారుచేసే ప్రయత్నానికి ఆటంకం కలుగుతోంది. శిష్యుడిగా అవటమంటే, తనను తాను ఉపేక్షించుకోవటం మరియు చివరకు ఎంత కష్టాన్నైన ఓర్చుకోవటం. ఒకవేళ శిష్యుడిగా అవటం అనేది మన ఇష్టపూర్వకమైనప్పుడు, అధిక శాతం మంది మరి ముఖ్యంగా తాము శిష్యులముకాకున్నను పరలోకానికి ప్రవేశింపబడుతాము అని భావించేవారు శిష్యులుగా ఉండటాన్ని ఎన్నుకోరు.

కాబట్టి మనలను మనము ప్రశ్నించు కొనే కొన్ని **చాలా** ముఖ్యమైన ప్రశ్నలు ఇక్కడ ఇస్తున్నాను. ఒకడు యేసుక్రీస్తుకు శిష్యుడిగా ఉండకపోయినను పరలోక సంబంధ విశ్వాసులుగా ఉండవచ్చునని లేఖనములు బోధిస్తున్నాయా? విశ్వాసుల విషయంలో శిష్యత్వము అనేది మన ఇష్టపూర్వకంగా తీసుకునే నిర్ణయమా? క్రైస్తవులలో సమర్పణలేని విశ్వాసులు మరియు సమర్పణగల శిష్యులు అని రెండు వర్గాలు ఉన్నాయా?

ఈ ప్రశ్నలన్నిటికి జవాబు ***లేదు*** అని చెప్పబడుతోంది. క్రొత్తనిబంధనలో ఎక్కడా కూడా క్రైస్తవులలో విశ్వాసులు మరియు శిష్యులు అనే రెండు వర్గాలు ఉన్నాయని చెప్పబడలేదు. ఒకవేళ ఎవరైన అపొస్తుల గ్రంథం చదువుచున్నట్లైతే, ఆందులో ***శిష్యులకు*** సంబంధించిన వాక్యాలను పదేపదే చదువుతాడు, మరియు వాస్తవంగా అవి ఎంతో సమర్పణభావం కలిగిన ఉత్తమ శ్రేణి విశ్వాసులకు సంబంధించినవి కావు. యేసునందు విశ్వసించు ***ప్రతివాడు*** ఆయన శిష్యుడే.[3] వాస్తవంగా

“మొట్టమొదట అంతియొకయలో ***శిష్యులు క్రైస్తవులనబడిరి***” (అపొ 11:26).

***శిష్యుడు*** అనే పదం మెథటీస్(mathetes) అనే గ్రీకు పదం నుండి తర్జుమా చేయబడింది. ఇది 261 సార్లు క్రొత్త నిబంధనలో కనబడుతుంది, మరియు పిస్టోస్(pistos) అనే గ్రీకు పదం నుండి వచ్చినదే ***విశ్వాసులు*** అనే పదం ఇది 9 సార్లు మాత్రమే కనబడుతుంది.

---

[3] శిష్యుల గురించి అపొ 6:1, 2, 7; 9:1, 10, 19, 36, 38; 11:26, 29; 13:52; 14:20, 21, 22, 28; 15:10; 16:1; 18:23, 27, 19:1, 9, 30; 20:1, 30; 21:4. 16 లో ప్రస్తావించబడింది. కాని విశ్వాసుల గురించి అపొ 5:14; 10:45 మరియు 16:1 లో మాత్రమే ప్రస్తావించబడింది. ఉదాహరణకు అపొ 14:21 లో లూకా ఇలా వ్రాస్తున్నాడు, “వారు (పౌలు మరియు బర్నబాసు) ఆ పట్టణములో సువార్త ప్రకటించి అనేకులను శిష్యులనుగా చేసి...” ఆవిధంగా పౌలు మరియు బర్నబాసు సువార్తను ప్రకటించటం ద్వార శిష్యులను తయారుచేసారు మరియు ప్రజలు వారి బోధనకు వెంటనే శిష్యులుగా మారిపోయారు. అంతేకాని వారికి అనుకూలమైన సమయంలో కాదు.

గ్రీకు పదమైన క్రిస్టియానోస్ (Christianos) నుండి తర్జుమా చేయబడినది **క్రైస్తవుడనే** పదం, ఇది కేవలం 3 సార్లు మాత్రమే బైబిలులో కనబడుతుంది. ఆది సంఘంలో క్రీస్తునందు విశ్వసించిన వారందరూ ఆయన శిష్యులుగా పరిగణించబడ్డారు అని ఒప్పించటానికి ఈ నిజాలు చాలు అనుకుంటాను.

## యేసు చేసిన వాఖ్యానం

శిష్యుడిగా మారటం అనేది విశ్వాసుల విషయంలో అంత ముఖ్యం కాదు, అది వారి ఇష్టాఅయిష్టాలమీాద ఆధారపడి ఉంది అని యేసు ఎన్నడూ తలంచలేదు. లూకా 14వ అధ్యాయంలో మనం చదివినట్లుగా, యేసు శిష్యత్వం గూర్చి చెప్పిన మూడు లక్షణాలు, ఉన్నత పిలుపునకై విశ్వాసుల నుద్దేశించి ఇచ్చిన పిలుపు కాదు. వాస్తవంగా ఆయన మాటలు ఆ జన సమూహంలోని ప్రతి ఒక్కరినీ ఉద్దేశించి చెప్పబడ్డాయి. శిష్యత్వం అనునది దేవునితో సంబంధం కలిగి ఉండటానికి తీసుకునే మొట్టమొదటి అడుగు. యోహాను 8వ అధ్యాయంలో దీనిగురించి చదవగలము:

> యేసు ఈ మాటలు చెబుతుండగా ***అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి***. కనుక యేసు తన యందు ***విశ్వాసముంచిన యూదులతో*** ఈ విధంగా చెబుతున్నాడు, "మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు ***శిష్యులై***యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31-32).

తన శిష్యులుగా మారేవారి గురించి క్రొత్తగా విశ్వాసంలోకి అడుగు పెట్టిన వారితో యేసు చెప్పిన తిరుగులేని సత్యాలకు వ్యతిరేకంగా ఎవ్వరుకూడ ఎంత జ్ఞానమున్నప్పటికీ వాదించలేరు. యేసు నూతన విశ్వాసులకు ఈ విధంగా **చెప్పలేదు**, భవిష్యత్తులో ఏదో ఒకరోజున నా శిష్యుడిగా మారుటకు సమర్పణ అనెడి రెండవ అడుగు తీసుకునే విషయం గురించి ఆలోచిస్తావు". లేదు ***విశ్వాసులు*** మరియు ***శిష్యులు*** అనే ఆ రెండు పదాలు ఒకే అర్థాన్ని స్ఫురింపచేస్తున్నట్లుగా యేసు ఆ నూతన విశ్వాసులతో వారు తన వాక్యమునందు నిలిచి ఉండటం చేత తన శిష్యులుగా రుజువు చేయగలరని మరియు దానిఫలితంగా వారు పాపమునుండి విడుదలై స్వతంత్రులవుతారని చెప్పెను (యోహాను 8:34-36 చూడుము).

ఈ ప్రజలు ***వ్యక్తపరిచే*** విశ్వాసం వారు నిజంగానే తనను విశ్వసిస్తున్నారనే హామీని ఇవ్వదని యేసుకు తెలుసు. ఎవరైతే యేసు నిజంగానే దేవుని కుమారుడని విశ్వసిస్తారో వారు ఈ విధంగా నడుచుకుంటారు. వారు తక్షణమే ఆయన శిష్యులుగా మారి పోతారు. ఆయనను సంతోష పెట్టటానికి మరియు విధేయత చూపటానికి తపన చెందుతారు అని కూడా యేసుకు తెలుసు. అటువంటి విశ్వాసులు/శిష్యులు సహజంగానే ఆయన వాక్యమునందు నిలిచి దానిని తమ నివాసంగా చేసుకుంటారు. వారు ఆయన ఆజ్ఞలను గ్రహించుట ద్వార ఆయన చిత్తాన్ని కనుగొన్నప్పుడు క్రమంగా వారి పాపములనుండి విముక్తి పొందుతుంటారు.

అందుకనే యేసు ఆ నూతన విశ్వాసులను తమ్మును తాము పరీక్షించుకొమ్మని సవాలు విసిరాడు. "మీరు ***నిజంగా*** నా శిష్యులైతే" అని ఆయన చేసిన ప్రకటన బట్టి చూస్తే వారు పైకి శిష్యులమని చెప్పుకుంటున్నారు కాని, నిజంగా వారు **నిజమైన** శిష్యులు కారనే విషయం ఆయన ప్రకటన ద్వార తెలుస్తోంది. వారు తమ్మును తాము మోసపుచ్చుకుంటున్నారు. కేవలం యేసు పెట్టిన పరీక్షను మాత్రము గనుక వారు పాసై ఉంటే వారు ఆయన నిజమైన శిష్యులై ఉండేవారు (యోహాను 8:37-59లోని మిగిలిన భాగాన్ని చదివినట్లై యితే వారి నిజాయితీని సందేహించటానికి యేసుకు ఏదో బలమైన కారణము ఉండినట్లుగా కనబడుతోంది.)[4]

మత్తయిలోని కీలకమైన అధ్యాయం 28:18-20 లోని లేఖన భాగం గనుక మనము పరిశీలిస్తే శిష్యులనగా సమర్పించుకున్న విశ్వాసులలో ఉన్నత తరగతికి చెందిన వారు అన్న అభిప్రాయాన్ని కొట్టివేస్తోంది. యేసు ఆజ్ఞాపించిన ఆ బృహత్తరమైన కార్యములో ***శిష్యులు*** బాప్తిస్మం పొందవలెనని ఆదేశించాడు. అపొస్తలు విశ్వాసులకు బాప్తిస్మం ఇవ్వకముందు వారు తమ జీవితాలను క్రీస్తుకు సమర్పించుకోవాలనే ఒక బలమైన నిర్ణయం తీసుకునేవరకు అపొస్తలు వేచిఉన్నట్లుగా అపొస్తల కార్యములలో ఎక్కడా వ్రాయబడి ఉండలేదు. దానికి బదులుగా అపొస్తులు నూతన విశ్వాసులందరూ  మారుమనస్సు పొందిన వెంటనే వారికి తక్షణమే బాప్తిస్మం ఇస్తూవచ్చారు.

ఈ ప్రకారంగా ఎవరైతే శిష్యులనేవారు అసాధారణమైన అంకిత భావం కలిగిన విశ్వాసులు అని భావిస్తుంటారో వారు తమసొంత మత శాస్త్రజ్ఞానం పట్ల  స్థిరంగా లేరు అని అర్థం. వారిలో చాలా మంది తాము యేసును విశ్వసిస్తున్నాం అంటూ ఎవరుచెప్పినా వారికి బాప్తిస్మం ఇస్తారు. అంతేకాని వారు "శిష్యత్వం" అనే స్థాయికి ఎదిగే వరకు వేచి ఉండరు. అయిననూ వారు గనుక తాము ప్రసంగిస్తున్నది ఏమిటో గ్రహించి దానిని విశ్వసించినట్లైతే వారిలో ఎవరైతే శిష్యత్వపు స్థాయికి ఎదుగుతారో వారికి మాత్రమే బాప్తిస్మం ఇస్తారు. ఆ స్థాయికి ఎదిగేవారు చాలా  తక్కువగా ఉంటారు.

ఒకవేళ శిష్యులు గనుక విశ్వాసుల కన్నా ప్రత్యేకమైన వారైనచో, సహోదరులను ప్రేమించటం అనునది తిరిగి జన్మించిన **విశ్వాసులు** అనుటకు ఒకగుర్తు అని యోహాను ఆవిధంగా ఎందుకు వ్రాసాడు (1యోహాను 3:14)? మరియు ఒకని యెడల ఒకడు ప్రేమగల వారైనయెడల దీనినిబట్టివారు తనకు నిజమైన ***శిష్యులు***గా గుర్తించబడుతారని యేసు ఎందుకని ఆవిధంగా చెప్పాడు (యోహాను 13:35)?

---

[4] ఈ లేఖనభాగము నూతన విశ్వాసులను వారియొక్క రక్షణ గురించి నమ్మకం కలిగించుట కొరకు పాటించే తప్పుడు ఆధునిక విధానాన్ని చూపిస్తోంది. యేసు  కొత్తగా మారుమనస్సు పొందిన వారు ఆయనను అంగీకరిస్తున్నామని లేదా ఆయన యందు విశ్వసిస్తున్నామని చెబుతూ చేసే ఆ చిన్ని ప్రార్థన మూలంగా  వారు రక్షింపబడుతారు అని చెబుతూ వాళ్ళను నమ్మించలేదు. దానికి బదులుగా తాము ఒప్పుకుంది నిజమా కాదా అన్నది పరిశీలించుకోవలసిందిగా వాళ్ళకు సవాలు విసిరాడు.

## ఈ తప్పుడు బోధకు మూలకారణం

క్రైస్తవులలో విశ్వాసులు మరియు శిష్యులు అనే రెండు వివిధ వర్గాలు ఉన్నాయి అన్న అంశం లేఖనములలో ఎక్కడా కనబడనియెడల, ఇటు వంటి తప్పుడు బోధ ఎందుకని సమర్థించబడుతోంది? దీనికి జవాబు ఏమిటంటే రక్షణను గూర్చి మరియెక తప్పుడు బోధ దీనిని పూర్తిగా సమర్థిస్తోంది, శిష్యత్వమునకు కావలసిన అర్హతలు కృపద్వారా రక్షింపబడుతాం అన్న సత్యానితో ఏమాత్రం పొసగవు. ఆ వాదనను ఆధారం చేసుకొని శిష్యత్వానికి కావలసిన అర్హతలు, రక్షణ పొందుటకు కావలసిన అర్హతలుగా ఉండనక్కరలేదన్న ఒక నిర్ధారణకు వచ్చింది. శిష్యత్వానికి ఏ అర్హతలైతే అవసరమో అవే అర్హతలు రక్షణ పొందుటకు అవసరంలేదు అన్న ఒక అభిప్రాయం ప్రజల్లో వెలువడింది. ఆవిధంగా కృపద్వార రక్షింపబడిన విశ్వాసుల విషయంలో శిష్యుడిగా మారటం అన్నది వారి వారి ఇష్టాయిష్టాల మీద ఆధారపడిఉన్నది.

ఈ వినాశకరమైన లోపభరితమైన వాదనను లేఖన భాగములు వ్యతిరేకిస్తున్నాయి. ఉదాహరణకు క్రీస్తు కొండమీద తన ప్రసంగంలో అనేకమైన విషయాలను చెపుతూవచ్చాక చివరిగా ఆయన చెప్పిన మాటలను చూస్తే వాటి కంటే స్పష్టంగా ఏముంటాయి?

> ''ప్రభువా, ప్రభువా'' అని నన్ను పిలుచు ప్రతివాడును
> పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి
> చిత్తప్రకారము చేయువాడే
> ప్రవేశించును'' (మత్తయి 7:21).

యేసు ఇక్కడ మరియు అనేక ఇతర చోట్ల చేసిన వాఖ్యానములనుబట్టి చూస్తే ఆయన రక్షణతో విధేయతను కూడ జోడిస్తున్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. కనుక కృపద్వారానే రక్షణ సాధ్యం అని బైబిలు ఓపక్క స్థిరంగా చెప్పుతుండగా దానితో ఏ విధంగా మనం ఇటువంటి అనేకమైన లేఖనములను సరిపుచ్చ గలుగుతాం? ఇది చాలా సులభం. దేవుడు తన ఆశ్చర్యకరమైన కృపద్వార ప్రతి ఒక్కరికి పశ్చాత్తాపపడుటకు, విశ్వసించుటకు, నూతనంగా జన్మించుటకు, ఆయనకు విధేయులై జీవించుటకు, పరిశుద్ధాత్మని సహాయం పొందుటకు, తాత్కాలికంగా ఒక మంచి అవకాశాన్ని ఇస్తున్నాడు. కనుక రక్షణ అనునది కృపద్వారా కలుగుతుంది. దేవుని కృపలేకుండా ఎవరూ రక్షింపబడలేరు, ఎందుకనగా ప్రతి ఒక్కరు పాపము చేసినవారు కాబట్టి. పాపులు రక్షణ పొందటం సాధ్యపడదు. కనుక వారు రక్షింపబడవలనంటే దేవుని కృప అవసరం.

మన రక్షణ గురించి దేవుని కృప అనేక విధాలుగా వెల్లడిచేయబడుతూ ఉంటుంది. యేసు సిలువపై మరణించటం ద్వార ఇది వెల్లడి చేయబడినది. ఇంకా చెప్పాలంటే దేవుడు సువార్త ద్వార మనలను పిలవటం, క్రీస్తు వైపునకు మనలను ఆకర్శించటం, మన పాపముల గురించి మనలను ఒప్పింప జేయటం ద్వార, మారు మనస్సు పొందుటకు ఒక సదావకాశాన్ని మనకు అనుగ్రహించటం, మనలను తిరిగి నూతన సృష్టిగ చేస్తు మనలో తన పరిశుద్ధాత్మని నింపి మన జీవితాలను యేలుతున్న పాపపు అధికారాన్ని అంతం చేయటం ద్వార, మనలను పరిశుద్ధులుగా జీవించులాగున చేసి మనం పాపం చేసినప్పుడు మనలను క్రమశిక్షణలో పెట్టటం,

ఇలా ఎన్నోవిధాలుగా ఆయన కృప మనపట్ల వెల్లడి అవుతూఉంటుంది. ఈ ఆశీర్వాదాల్లో ఏ ఒక్కటికూడా మనం సొంతంగా సంపాదించలేదు. ఆరంభం నుండి అంతం వరకు మనం కృపద్వారానే రక్షింపబడుతూ వస్తున్నాం.

అయినప్పటికీ లేఖనముల ప్రకారం చూస్తే రక్షణ అనునది కేవలం "కృపద్వార" మాత్రమే కాదు, "విశ్వాసం ద్వారా" కూడ లభ్యం అవుతుంది అని అర్ధం అవుతుంది : "**మీరు విశ్వాసము** ద్వార ***కృపచేతనే*** రక్షింపబడియున్నారు" (ఎఫెసి 2:8). ఈ రెండు అంశములు అవసరమైనవే, కాని విశదంగ పరిశీలిస్తే అవి రెండు ఒక దానికి ఒకటి పొసగవు. ప్రజలు రక్షింప బడవలెనంటే, కృప మరియు విశ్వాసం రెండూ అవసరం. దేవుడు తన కృపను అనుగ్రహిస్తాడు, దానికి మనం మన విశ్వాసం ద్వార ప్రత్యుత్తరమిస్తాం. నిజమైన విశ్వాసం దేవుని ఆజ్ఞలకు లోబడేల చేస్తుంది. యాకోబు తన పత్రికలో రెండవ అధ్యాయంలో వ్రాసినట్లుగా, విశ్వాసము క్రియలులేనిదైతే అది మృతమైనదగును, అది మనలను రక్షించలేదు (యాకోబు 2:14-26).[5]

దేవుని కృప ఎవ్వరినీ పాపం చేయుటకు అనుమతించదు అన్నది వాస్తవం. దానికంటే కూడా, దేవుని కృప ప్రజలు తమ పాపముల గురించి పశ్చాత్తాపపడి తిరిగి జన్మించుటకు ఒక తాత్కాలికమైన అవకాశాన్ని ఇస్తుంది. మరణానంతరం, ఎట్టి పరిస్థితుల్లో కూడా మారుమనస్సు పొందుటకు తిరిగి జన్మించుటకు అవకాశముండదు, కనుక దేవుని కృప ఎక్కువ కాలం ఉండదు. కాబట్టి రక్షణ నొసగే ఆయన కృప కొద్దికాలం వరకే మనకు లభిస్తుంది.

## విశ్వాసం ద్వార కృపచేత యేసుచే రక్షింపబడిన స్త్రీ

విశ్వాసం ద్వార కృపచేత రక్షణ అనుగ్రహించబడటం అన్న దాని గురించి ఒక సరైన సాదృశ్యం మనకు ఈ కథలో కనబడుతుంది, అదేదనగా, వ్యభిచారంలో పట్టుబడిన ఒక స్త్రీ యేసును కలవటం గూర్చిన కథ ద్వార మనకు ఇది అర్ధమవుతుంది. యేసు ఆమెతో అంటాడు, "నేనును నీకు శిక్ష విధించను (**ఇదియే** కృప అంటే ఎందుకనగా ఆమె శిక్షకు పాత్రురాలైనప్పటకీ ఆమెను క్షమించాడు); నీవు వెళ్ళు; ***ఇక పాపము చేయకు***"(యోహాను 8:11). ఆమె మరణశిక్షకు పాత్రురాలైనప్పుడు యేసు ఆ శిక్షనుండి ఆమెకు విముక్తి కలిగించాడు. అయినప్పటికీ యేసు ఆమెకు ఒక హెచ్చరిక ఇచ్చి పంపాడు, ***ఇక పాపము చేయకు***. సరిగ్గా ఆవిధంగానే ప్రపంచంలోని ప్రతి పాపితోయేసు చెబుతున్నాడు, "నేను నిన్ను శిక్షింటములేదు, నీవు మరణానికి పాత్రుడవి మరియు నరకంలో నిత్యాగ్నిలో పడద్రోయబడుటకు

[5] ఇంకా చెప్పాలంటే, ఎవరైతే తాము మంచి క్రియలు కలిగి ఉండకపోయిననూ, తమకున్న విశ్వాసము ద్వారా రక్షింపబడుతాము అని చెప్పుకునే వారికి వ్యతిరేకంగా యాకోబు ఇలా అంటున్నాడు, మనం కేవలం విశ్వాసం ద్వార మాత్రమే రక్షింపబడము: "మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రముకాక క్రియల మూలముననను నీతిమంతుడని యెంచబడునని, మీరు దీనివలన గ్రహించితిరి." నిజమైన విశ్వాసము ఎప్పుడూ ఒంటరిదై ఉండదు అది క్రియలతో

అర్హుడైనప్పటికీ నేను నీపట్ల కృపచూపుతున్నాను. నా కృప తాత్కాలికమైనది, కనుక ఇప్పుడే పశ్చాత్తాపం చెందుము. నా కృప ముగియక మునుపే మరియు నా తీర్పురోజున ఒక పాపిగా నా ఎదుట నిలబడక ముందే ఇప్పుడే నీ పాపాన్ని విడిచిపెట్టుము.”

యేసు ఉపదేశించాక ఆ వ్యభిచార స్త్రీ పశ్చాత్తాప పడింది అని అనుకుందాం. ఒకవేళ ఆమె ఆవిధంగా పశ్చాత్తాపం చెందినచో, ఆమె విశ్వాసం ద్వార కృపచేత రక్షింపబడినది. కాని ఆమె కృపద్వారానే రక్షింపబడినది ఎందుకంటే ఆమె ఒక పాపి కనుక దేవుని కృపలేకుండా ఆమె ఎన్నటికి రక్షింపబడి ఉండేది కాదు. ఆమె ఎప్పుడు కూడా తన క్రియలద్వారానే రక్షింపబడ్డాను అని చెప్పిఉండేది కాదు. ఆమె యేసును విశ్వసించటం చేత రక్షింపబడింది. ఆవిధంగా తనతో ఆయన చెప్పిన మాటలయందు విశ్వసించి, ఆయన హెచ్చరికను లక్ష్యంచేసి ఇక ఆలశ్యించక తన పాపాలను విడిచిపెట్టింది. ఎవరైతే యేసునందు నిజమైన విశ్వాసం కలిగి ఉంటారో వారు మారుమనస్సు పొందుతారు. కారణం మారుమనస్సు పొందని వారు నశిస్తారు అని యేసు హెచ్చరించాడు (లూకా 13:3), తండ్రి చిత్తప్రకారం చేయువాడే పరలోకమునందు ప్రవేశించుతాడని యేసు గంభీరంగా ప్రకటించాడు కూడా (మత్తయి 7:21). ఎవరైతే యేసును విశ్వసిస్తారో వారు ఆయన హెచ్చరికలను లక్ష్యము చేస్తారు.

అయితే ఆ వ్యభిచార స్త్రీ తన పాపము గురించి పశ్చాత్తాపం చెందలేదు అని అనుకుందాం అలా మారుమనస్సు పొందని పక్షంలో ఆమె ఆవిధంగా పాపంచేస్తూనే ఉంటుంది, ఎదో ఓరోజున మరణించి, తీర్పు రోజున ఆయన సింహాసనం ముందు నిలబడుతుంది. ఆమె యేసుతో ఈ విధంగా చెబుతున్నట్లు ఊహించినచో, “ఓ యేసు! నిన్ను చూడడం **చాలా** సంతోషం. నేను భూమిమీద ఉన్నప్పుడు పాపంలో పట్టుబడి నీ యెదుటికి తీసుకొని రాబడినప్పుడు, నీవు నన్ను ఎందుకని శిక్షించలేదో అదంతా నాకు గుర్తుంది. నీవు ఇప్పటికీ ఆదే దయకలిగినవాడవు. నీవు నన్ను అప్పుడు శిక్షించలేదు అదేవిధంగా ఇప్పుడూ ఎట్టిపరిస్థితిలో శిక్షించవు”. నీవు ఏమనుకుంటున్నావు? యేసు ఆమెను పరలోకంలోనికి ఆహ్వానిస్తాడనా? దీనికి జవాబు చాలా స్పష్టంగా లేఖనములలో వ్రాయబడింది. పౌలు ఈ విధంగా హెచ్చరిస్తున్నాడు:

> అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి, జారులైనను విగ్రహారాధకులైనను దోచుకొను వారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు (1కొరింథి 6:9-10).

ఇదంతా చెప్పేది ఏమిటంటే యేసు శిష్యత్వానికి కావలసిందల్లా ఆయన యందు నిజమైన విశ్వాసం, అంటే ***మనలను రక్షించే విశ్వాసం*** కలిగివుండటం. ఎవరైతే రక్షించే విశ్వాసం కలిగిఉంటారో వారు తమ విశ్వాసం ద్వార కృపచేత రక్షింపబడతారు. కృపద్వార రక్షణ కలుగును కనుక యేసు కోరుకునే శిష్యత్వపు అర్హతలు, రక్షణ పొందుటకు ఆయన కోరుకునే అర్హతలతో పొసగవు అన్న వాదనకు బైబిలు పరంగా ఎటువంటి ఆధారాలు లేవు. శిష్యత్వం స్వీకరించటం అనునది పరలోక సంబంధ విశ్వాసులు తమ ఇష్టమును బట్టి తీసుకునే

నిర్ణయం కాదు; ఇంకోమాటలో చెప్పాలంటే ***శిష్యత్వం అనునది రక్షణనొసగే నిజమైన విశ్వాసానికి ఒక నిదర్శనం అన్నమాట.***[6]

అది అలాఉండగా ***దేవుని దృష్టిలో ఒక దైవసేవకుడు విజయం సాధించిన వాడుగా కనబడాలంటే, అతడు నిజమైన సువార్తను బోధిస్తూ, విధేయతతో కూడిన విశ్వాసం కలిగి ఉండాలని ప్రజలకు ఉపదేశిస్తూ ఆవిధంగా సరైన రీతిలో శిష్యులను తీర్చిదిద్ద వలసిఉంటుంది.*** ఎప్పుడైతే దైవసేవకులు, శిష్యత్వం స్వీకరించటం అనునది, విశ్వాసులు తమ ఇష్టానుసారంగా తీసుకునే నిర్ణయం అని చెబుతూ తప్పుడు సిద్ధాంతాలను బోధిస్తుంటారో వారు శిష్యులను చేయుమని యేసు జారీ చేసిన ఆజ్ఞకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు అని చెప్పవచ్చు. ఆ విధంగ వారు తప్పుడు సువార్తను ప్రకటించటమే కాక కృపను గూర్చి తప్పుగా ప్రకటిస్తున్నారు. యేసు వాగ్దానం చేసినట్లుగా "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారం చేయువాడే ప్రవేశించును," కేవలం నిజమైన క్రీస్తు శిష్యులు మాత్రమే రక్షణ నొసగే విశ్వాసాన్ని కలిగి ఉండి పరలోకం వెళ్ళుతారు.

## క్రొత్త తప్పుడు సువార్త

రక్షణ విషయంలో దేవుని కృపను గూర్చిన తప్పుడు అభిప్రాయం కారణంగా, నేటి ఆధునిక సువార్తలో కృపను గూర్చిన సందేశముతో పొసగని కొన్ని ముఖ్యమైన బైబిలు అంశాలు తొలగించబడుతున్నవి. ఏది ఏమైనప్పటికీ తప్పుడు సువార్త తప్పుడు భావాలు కలిగిన క్రైస్తవులనే తయారుచేస్తుంది. అందుచేతనే "క్రొత్తగా మారిన" ఈ నాటి క్రైస్తవులు, తాము "యేసుక్రీస్తును స్వీకరించిన" అతికొద్ది వారాలకే చర్చికి రావటం మానుకుంటారు. ఇంకా చెప్పాలంటే చర్చిలకు హాజరయ్యేవారు అనేకులు మారుమనస్సు పొందనివారి మధ్య ప్రత్యేకంగా ఉండక వారితో కలిసిపోయి వారిలాగే పాపములు చేస్తూఉంటారు. దీనికి కారణం ఏమిటంటే వారు నిజంగా యేసును విశ్వసించటం లేదు. వాస్తవంగా వారు నూతనంగా జన్మించిన వారు కారు.

నేటి ఆధునిక సువార్తలో తొలగింపబడిన ముఖ్యమైన అంశములలో ఒకటి ఏదనగా మారుమనస్సు నిమిత్తమైన పిలుపు. చాలామంది దైవసేవకులు తాము ప్రజలను పాపములు

---

[6] రక్షణ అనునది క్రియల వలన కాక కృప ద్వారా దొరుకును అని పౌలు నొక్కి చెప్పటానికి గల కారణం ఆ రోజుల్లో న్యాయవాదులతో అతను నిరంతరం పోరాడుతూ ఉండేవాడు అన్న విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవటం మంచిది. పరలోకం చేరుటకు పరిశుద్ధత అనునది చాలా ముఖ్యం అని బోధించే వారిని సరిదిద్దుటకు పౌలు ప్రయత్నించలేదు ఎందుకంటే అతను కూడా దానిని నమ్ముతున్నాడు మరియు అప్పుడప్పుడు దానిని నొక్కి చెప్పేవాడు కనుక. వాస్తవంగా అతను యేసు చనిపోవటానికి గల కారణం తెలియని మరియు రక్షణ విషయంలో దేవుని కృపను గూర్చిన అవగాహన లేని యూదులను సరిదిద్దటానికి వ్రాసాడు. అన్యులకు రక్షణను అనుగ్రహించే దేవుని కృపను గూర్చిన అవగాహన ఉండదు కనుక వారు ఎప్పటికీ రక్షింపబడరు అని అనేకులు అనుకుంటుఉంటారు. సున్నతి వంశము లేదా ఆజ్ఞలు పాటించటం అనునవి ఒకడు రక్షణ పొందటంలో సహాయపడుతాయి అని కొందరు భావిస్తుంటారు. ఆవిధంగా దేవుని కృపను యేసు చనిపోవటానికి గల అవసరతను నిరర్థకం చేస్తున్నారు.

చేయటం మానుకొమ్మని వారితో చెప్పటం (వ్యభిచార నేరంలో పట్టుబడ్డ స్త్రీతో యేసు చెప్పినట్లుగా) రక్షణ కృప ద్వార కాదు, క్రియలద్వారే లభ్యమవుతుంది అని చెప్పటంతో సమానమని భావిస్తుంటారు. కాని ఇది నిజంకాదు, ఎందుకంటే బాప్తిస్మం ఇచ్చు యోహాను, యేసు, పేతురు మరియు పౌలు వీరందరూ మారు మనస్సు అనునది రక్షణ పొందుటకు ఎంతో అవసరమని ప్రబోధిస్తూ వచ్చారు. ఒకవేళ మారుమనస్సు గూర్చిన బోధ, రక్షణ విషయంలో దేవుని కృప యెక్క ఆవశ్యకతను వ్యతిరేకిస్తున్న పక్షంలో బాప్తిస్మం ఇచ్చు యోహాను, యేసు, పేతురు మరియు పౌలు వీరందరూ రక్షణ విషయంలో దేవుని కృపను వ్యతిరేకించి ఉండేవారు. కాని దేవుని కృప మానవులు మారుమనస్సు పొందటానికి ఒక తాత్కాలికమైన అవకాశాన్ని ఇస్తున్నది, అంతేకాని పాపాన్ని కొనసాగించటానికి కాదు అన్న సంగతి వారు గ్రహించారు.

ఉదాహరణకు, లూకా సువార్తలో బాప్తిస్మం ఇచ్చు యోహాను ప్రకటిస్తున్న తీరును గమనిస్తే ఆయన ప్రసంగం మారుమనస్సు మీదే కేంద్రీకృతమై ఉంటుంది (లూకా 3:1-18). ఎవరైతే మారుమనస్సు పొందరో వారు నరకానికి పోతారు (మత్తయి 3:10-12; లూకా 3:17).

యేసు తన పరిచర్య ప్రారంభం నుంచే మారుమనస్సు గురించి బోధించటం ప్రారంభించారు (మత్తయి 4:17). మారుమనస్సు పొందని వారు నాశనమవుతారని ఆయన ప్రజలను హెచ్చరిస్తూ వచ్చాడు (లూకా 13:3,5).

యేసు తన శిష్యులను వివిధ పట్టణాలలో బోధించుటకు పంపాడు, దానిని మనం (మార్కు 8:12)లో చూస్తాము, "కాగా వారు బయలుదేరి **మారుమనస్సు** పొందవలెనని ప్రకటించిరి."

పునరుత్థానము తర్వాత యేసు తన పన్నెండు మంది శిష్యులతో మారుమనస్సును గూర్చిన సందేశాన్ని ప్రపంచమున కంతా తెలియజేయుమని చెప్పాడు, ఎందుకనగా పాపక్షమాపణ అనే తలుపును తెరుచుటకు అది ఒకతాళపు చెవివంటిది:

> క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు,
> యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట
> ***మారుమనస్సును పావ క్షమావణయు*** ప్రకటింపబడుననియు
> వ్రాయబడి యున్నది (లూక 24:46-47)."

యేసు యెక్క ఆదేశాన్ని అపొస్తలు శిరసావహించారు. పెంతుకొస్తు దినమున పేతురు బోదిస్తున్నప్పుడు, అతను చెప్పేది వింటున్న ప్రజలు తాము ఇటీవలె సిలువ వేసిన అ వ్యక్తి గురించిన సత్యాన్ని గ్రహించాక , తాము ఏమి చేయవలెనని పేతురును అడిగారు. అప్పుడు పేతురు వారు మారు మనస్సు పొందవలెనని ప్రత్యుత్తరమిచ్చాడు (అపొ 2:38).

సొలోమోను మంటపములో పేతురు ఆ జనసమూహమునకు చెప్పిన రెండవ ప్రసంగంలో కూడ ఇదే సందేశం చెప్పబడింది. పశ్చాత్తాపం చెందక పోతే పాపములు తుడిచి పెట్టబడవు.[7]

---

[7] ఆవిధంగానే అన్యులు క్రీస్తునందు విశ్వసించటం ద్వార (తరువాయి భాగం పక్క పేజీ లో చూడుము)

మీ పాపములు తుడిచి వేయబడు నిమిత్తమును **మారుమనస్సునొంది** తిరుగుడి (అపొ3:19).

అగ్రిప్ప రాజు ముందు పౌలు సాక్ష్యమిస్తున్నప్పుడు తాను ప్రకటించే సువార్తలో మారుమనస్సు గూర్చిన సందేశం ఎప్పుడు ఉంటుందని ప్రకటించాడు.

> కాబట్టి అగ్రిప్పరాజా, ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక మొదట దమస్కులోని వారికిని, యెరూషలేములోను యూదయ దేశమంతటను, తర్వాత అన్యజనులకును **వారు మారుమనస్సు పొంది దేవునితట్టు తిరిగి** మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని ప్రకటించుచుంటివి (అపొ 26:19-20).

పౌలు ఏథెస్సులోని ప్రజల ముందు ప్రసంగిస్తున్నప్పుడు, ప్రతి ఒక్కరు తీర్పు దినమున క్రీస్తు ముందు నిలబడవలసిఉంటుందని, ఎవరైతే మారుమనస్సు పొందరో వారు మహాదినము రోజున సిద్ధంగా ఉండరని చెప్పాడు.

> ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే **అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని** మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చ బోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసి యున్నాడు (అపొ 17: 30-31).

తాను వెళ్ళకముందు ఎఫెసులోని సంఘ పెద్దల ముందు పౌలు చెప్పిన ప్రసంగంలో విశ్వాసంతో పాటు, తన సందేశంలో మారుమనస్సును గూర్చిన అంశమును కూడా చేర్చాడు:

> మరియు ప్రయోజనకరమైనది ఏదియు దాచుకొనక బహిరంగముగాను, ఇంటింటను మీకు తెలియజేయుచు బోధించుచు, దేవుని యెదుట **మారుమనస్సు** పొంది మన ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాస ముంచవలెనని, యూదులకును గ్రీసుదేశస్థులకును సాక్ష్యమిచ్చు చుంటిని(అపొ 20: 20,21).

మారుమనస్సును గూర్చిన ఆవశ్యకత ప్రకటించకపోతే అది నిజమైన సువార్త బోధ కాదు అని ఎవరినైన ఒప్పించటానికి వరుసగా ఇవ్వబడిన ఈ లేఖన భాగముల నిదర్శనములు

---

రక్షింపబడుతారు అన్న విషయాన్ని దేవుడు పేతురుకు వెల్లడిచేయగా, పేతురు కొర్నేలీ యింటివారికి ఈ విధంగా ప్రకటిస్తాడు, "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములును ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును" (అపొ 10:34-35). అపొ 5:32లో దేవుడు "తనకు విధేయులైన వారికి" పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తాడన్న విషయాన్ని పేతురు అపొ 5:32లో తెలిపాడు. నిజమైన క్రైస్తవులందరిలో పరిశుద్ధాత్ముడు నివసిస్తాడు (రోమా 8:9; గలతీ 4:6).

చాలు. దేవునితో మనకు గల సంబంధం మారుమనస్సుతో ప్రారంభమవుతుంది. మారుమనస్సు అనేది లేకపోతే మన పాపములు క్షమించబడవు.

## మారుమనస్సునకు క్రొత్త నిర్వచనం

రక్షణ అనునది మారు మనస్సు మీద ఆధారపడిఉంది అని ఎన్నో లేఖనముల నిదర్శనములు ఉన్నప్పటికీ, ఇంకా కొంతమంది దైవసేవకులు దేవుని కృపను గూర్చిన తమ తప్పుడు అభిప్రాయానికి అనుగుణంగా వాటి అర్థాలను మార్చేసి దాని ఆవశ్యకతను నిరర్థకం చేస్తున్నారు. వారి నూతన నిర్వచనం ప్రకారం మారుమనస్సు అనునది యేసు ఎవరు అన్నదాని గురించి తమ ఆలోచన విధానంలో వచ్చిన మార్పు అని అది వ్యక్తి యొక్క ప్రవర్తనమీద పెద్దగా ప్రభావం చూపదని వారి అభిప్రాయం.

కాబట్టి క్రొత్త నిబంధన బోధకులు మారు మనస్సు పొందుమని ప్రజలను పిలిచినప్పుడు వారి నుంచి ఏమి ఆశిస్తున్నారు? యేసు ఎవరు అన్న దానిగురించి మాత్రమే తమ అభిప్రాయమును మార్చుకోవాలని ప్రజలను పిలుస్తున్నారా? లేదా ప్రజలు వారి ప్రవర్తనను మార్చుకోవాలని పిలుస్తున్నారా?

నిజమైన పశ్చాత్తాపం ప్రవర్తనలో ఒక మార్పును కోరుకుంటుందని పౌలు విశ్వసించాడు. అతను, అగ్రిప్ప రాజు ముందు దశాబ్దపు పరిచర్య గురించి ప్రకటించిన తన సాక్ష్యాన్ని మనం ఇదివరకే చదివాము.

> కాబట్టి అగ్రిప్ప రాజా, ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక మొదట దమస్కులోని వారికిని, యెరూషలేములోను యూదయ దేశమంతటను, తరువాత అన్యజనులకును, వారు మారుమనస్సు పొంది దేవునితట్టు తిరిగి ***మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని*** ప్రకటించుచుంటిని (అపొ 26: 19-20).

బాప్తిస్మం ఇచ్చు యోహాను కూడా మారుమనస్సు అనేది, కొన్ని మతపరమైన సత్యాల గురించిన అవగాహనలో కలిగే మార్పు అని అంతకంటే మరేం కాదని నమ్మాడు. అతను బోధను అంగీకరిస్తున్న ప్రజలు మారు మనస్సు నిమిత్తమై అతను ఇస్తున్న పిలుపుకు ప్రత్యుత్తరముగా తాము ఏమి చేయాలి అని అడిగారు. అప్పుడతడు ప్రవర్తన విషయమై కొన్ని నిర్థిష్టమైన మార్పులను సూచించాడు (లూకా 3:3 ; 10-14). మారుమనస్సు పొందినట్లుగా నటిస్తున్న పరిసయ్యులను, సద్దూకయ్యులను చూచి అతడు పరిహసిస్తూ, వారు గనుక నిజంగా మారు మనస్సు పొందని పక్షంలో నిత్యాగ్నిలోకి పడవేయబడతారని వారిని హెచ్చరించాడు:

> సర్ప సంతానమా, రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధి చెప్పినవాడెవడు? కనుక ***మారుమనస్సునకు తగిన ఫలము ఫలించుడి***. ఇప్పుడే గొడ్డలి చెట్టువేరున ఉంచబడియున్నది గనుక

***మంచి ఫలము ఫలింపని ప్రతి చెట్టును నరక బడి అగ్నిలోవేయబడును*** (మత్తయి 3:7-10).

యోహానులాగ యేసు కూడ మారుమనస్సును గూర్చిన అదే సందేశాన్ని బోధించాడు (మత్తయి 3:2; 4:17). ఒక సందర్భంలో ఆయన నీనెవె పట్టణస్థులు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరని వివరించాడు (లూకా 11:32). యోనా గ్రంథం చదివిన వారు ఎవరైన సరే వారికి తెలుసు నీనెవె పట్టణస్థులు వారి మనస్సును మార్చుకొనటమే కాక దానికంటే ఎక్కువే చేసారని. వారు పాపము నుండి మళ్ళుకొని ఆ విధంగా తమ క్రియలను కూడా మార్చుకున్నారు. దీనిని యేసు **మారుమనస్సు** అని పిలుస్తున్నాడు.

***బైబిలు పరమైన మారుమనస్సు అనగా అర్థం, హృదయంలో జనియించే నిజమైన విశ్వాసానికి అనుగుణంగా ప్రవర్తనలో కలిగే ఇష్టపూర్వకమైన మార్పు.*** ఒక దైవసేవకుడు, మారుమనస్సును ధృవీకరించే విధంగా ఒక వ్యక్తి ప్రవర్తనలో కలిగే నిజమైన మార్పు యొక్క ఆవశ్యకతను గురించి తన సువార్త బోధలో చెప్పకపోయినట్లైతే అతడు వాస్తవంగా శిష్యుల నిమిత్తమైన యేసు కోర్కెకు వ్యతిరేకంగా బోధిస్తున్నాడు. ఇంకా చెప్పాలంటే వారు మారుమనస్సు పొందక పోయిననూ రక్షింపబడతారు అన్న విశ్వాసంలోకి వారిని నడిపించటం ద్వార ప్రేక్షకులను మోసం చేస్తున్నాడు వాళ్ళు అతనిని నమ్మితే తప్పనిసరిగా వాళ్లకు నరకదండన ప్రాప్తించును దానికి కారణం అతడే. అతడు దానిని గ్రహించనీ గ్రహించకపోని అతడు దేవునికి వ్యతిరేకంగా సాతానుకు అనుకూలంగా పనిచేస్తున్నాడు.

యేసు ఆదేశించిన రీతిగా ఒకసేవకుడు గనుక శిష్యులను తయారు చేయాలని పూనుకున్నచో అతడు ఆ కార్యాన్ని సరైన రీతిలో ప్రారంభించాలి. అతడు మారుమనస్సును గూర్చి మరియు విధేయతతోకూడిన విశ్వాసాన్ని గూర్చిన సువార్తను ప్రజలకు ప్రకటించని పక్షంలో అతడు ప్రజల దృష్టిలో గొప్ప విజయం సాధించిన వాడిగా అగుపడుతున్నప్పటికీ వాస్తవంగా అతడు ఓడిపోయాడు. అతనికి పెద్ద సంఘం ఉండవచ్చు, కాని అతడు దానిని కర్ర, గడ్డి, కొయ్యకాలుతో కడుతున్నాడు. రాబోయే దినమున అతని పని అగ్నిచేత పరీక్షంచబడినప్పుడు అది కాల్చి వేయబడును (1 కొరింథీ 3:12-15).

## సమర్పణకై యేసు ఇచ్చే పిలుపు

యేసు రక్షణ పొందని వారిని తమ పాపముల నుండి మరలుకొమ్మని మాత్రమే పిలవలేదు, దానితో పాటు తక్షణమే తనను వెంబడించుటకు, మరియు విధేయత చూపుటకు వారు సమర్పించుకోవాలని కూడా పిలిచాడు. ఈ రోజుల్లో చేస్తున్నట్టుగా ఆయన ఎన్నడూ స్వల్ప షరతులమీద రక్షణను అనుగ్రహించలేదు. "తనను అంగీకరించుమని" ఆయన ఎన్నడూ ప్రజలను కోరలేదు, మారుమనస్సు పొందినచో క్షమిస్తానని వాగ్దానం చేస్తూ, అటుపిమ్మట తనకు లోబడుటకు విధేయత చూపాలంటే వారంతకు వారు సమర్పించుకోవాలని సూచించాడు. లేదు మొదటి అడుగే హృదయ పూర్వకమైన సమర్పణ భావంతో తీసుకునే అడుగైఉండవలెనని

కోరాడు.

దు:ఖకరమైన విషయం ఏమిటంటే, ఈ విలువైన సమర్పణకొరకై యేసు ఇచ్చే పిలుపులు క్రైస్తవులమని చెప్పుకునేవారి చేత నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. ఒకవేళ అవి అంగీకరించబడినట్లయితే అవి, ఒక లోతైన సంబంధంకొరకైన పిలుపులని అవి రక్షింపబడనివారికి కాదు, కాని దేవుని రక్షించే కృపను ఇదివరకే పొందినవారికి మాత్రమేనని తెలపబడుతున్నాయి. కాని "విశ్వాసుల్లో" అనేకులు, ఈ విలువైన సమర్పణ కొరకై యేసు ఇచ్చే పిలుపులు తమనుద్దేశించినవని రక్షింపబడనివారు **ఆయన పిలుపును లక్ష్యం చేయరు అని వాదిస్తుంటారు**. వారి హృదయంలో లోబడకూడదు అని ఉన్నదికాబట్టి వారు దానికి స్పందించరు.

రక్షణ నిమితమై యేసు ఇచ్చే పిలుపులలో ఒకదాని గురించి ఆలోచిద్దాం. ఇది వరకే రక్షణపొందినవారిని ఉద్దేశిస్తూ ఒక లోతైన సంబంధం కలిగిఉండుటకై ఇచ్చే పిలుపుగా వివరించబడుతోంది:

> అంతట ఆయన తన శిష్యులను జనసమూహమును తన యొద్దకు పిలిచి-నన్ను వెంబడింప గోరువాడు తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువయెత్తుకొని నన్ను వెంబడింపవలెను. తన ప్రాణమును రక్షించు కొనగోరువాడు దాని పోగొట్టుకొనును; నా నిమిత్తమును సువార్త నిమిత్తమును తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని రక్షించు కొనును. ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము? మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి ఇయ్యగలుగును? వ్యభిచారమును పాపమునుచేయు ఈ తరమువారిలో నన్నుగూర్చియు నామాటలను గూర్చియు సిగ్గుపడువాడెవడో, వానిని గూర్చి మనుష్యకుమారుడు తన తండ్రి మహిమగలవాడై పరిశుద్ధ దూతలతో కూడా వచ్చునప్పుడు సిగ్గుపడునని చెప్పెను. (మార్కు 8:34-38).

ఈ పిలుపు రక్షణ నిమితమై అవిశ్వాసులను ఉద్దేశిస్తూ ఇచ్చినదా లేక గొప్ప సమర్పణ భావం కలిగిన విశ్వాసులను ఉద్దేశిస్తూ ఇచ్చినదా? మనం చదివిన భాగాన్ని చూస్తే దీనికి జవాబు చాలా స్పష్టంగా కనబడుతుంది

మొదట గుర్తించవలసినది ఏమిటంటే యేసు మాట్లాడుతున్న ఆ జనసమూహములో "ఆయన **శిష్యులతో** పాటు ఆ జనసమూహం కూడ ఉన్నారు". (34వ వచనం) సరిగ్గా గమనిస్తే ఆ "జన సమూహంతో" పాటు ఆయన శిష్యులు రాలేదు, వాస్తవంగా వారు, ఆయన ఏమి చెబుతున్నాడో దానిని వినుటకు పిలువబడ్డారు, యేసు ప్రతి ఒక్కరినీ అనగా తనను వెంబడించువారిని మరియు తనను వెదుకువారిని అనగా అందరినీ తాను చెప్పబోయే సత్యాన్ని గ్రహించాలనుకున్నాడు. అటుపిమ్మట ఆయన "**ఎవరైన**" (34వ వచనం) అని చెబుతూ

ప్రారంభించాడు. దానిని కూడా ఒక్కసారి గమనించండి. ఆయన మాటలు ఎవరికైన మరియు ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయి.

మనం ఇంకా చదువుతూపోతే ఆయన ఎవరిని ఉద్దేశించి చెబుతున్నాడో స్పష్టంగా తెలిసిపోతుంది. మరిముఖ్యంగా ఆయన మాటలు ఎవరైతే 1. ఆయననువెంబడించాలని కోరుకుంటారో 2. ఎవరైతే తమ ప్రాణాలు రక్షించుకోవాలని కోరుకుంటారో 3. ఎవరైతే తన ఆత్మ నశించకూడదని" కోరుకుంటారో 4. ఆయన తన తండ్రి మహిమ గలవాడై పరిశుద్ధ దూతలతో కూడ వచ్చునప్పుడు ఎవరిని చూసి ఆయన సిగ్గుపడకుండా ఉంటాడో వారిలో ఒకరిగా ఉండుటకు ఎవరైతే కోరు కుంటారో వారందరికీ ఆయన మాటలు వర్తిస్తాయి. ఈ నాలుగు స్వభావాలు రక్షింపబడాలని కోరుకుంటున్న వ్యక్తులను గూర్చి యేసు వర్ణిస్తున్నట్లుగా సూచిస్తున్నాయి. పరలోకం వెళ్లే వ్యక్తి తాను "యేసును వెంబడించాలని" కోరుకోడు మరియు తన "ప్రాణాలను రక్షించుకోవాలని" అనుకోడు అని మనం అనుకుంటామా? నిజమైన విశ్వాసులు తమ "ఆత్మలను నశింపచేసుకుంటారని" ఆలోచిస్తామా? వారు ఆయనను గూర్చి ఆయన మాటలను గూర్చి సిగ్గుపడితే ఆయన తిరిగి వచ్చినప్పుడు వారిని గూర్చి ఆయన సిగ్గుపడతాడు. ఈ లేఖన భాగంలో యేసు శాశ్వతమైన రక్షణను సంపాదించుకోవటం గురించి చాలా స్పష్టంగా మాట్లాడుతున్నాడు.

ఈ లేఖన భాగంలోని ప్రతివాక్యము, ముందు వాక్యాన్ని వివరించుటకు మరియు విశదీకరించుటకు తోడ్పడుతుంది. ఇతరులు దీనిని ఏ విధంగా వివరిస్తున్నారన్నది గ్రహించకుండా ఈ లేఖనభాగంలో ఏ ఒక్కవాక్యంకూడా వివరించబడదు. దానిని మనస్సునందుంచుకొని వాక్యంలోని యేసు మాటలను ఒక్కొక్కదాని గురించి ఆలోచిద్దాము.

## మొదటి వాక్యం

> నన్ను వెంబడింప గోరువాడు తన్ను తాను ఉపేక్షించుకొని తన
> సిలువయెత్తికొని నన్ను వెంబడింప వలెను (మార్కు 8:34).

మరియొకసారి దీనిని గమనించితే ఆయనను వెంబడించాలని , తనకు ***అనుచరుడుగా*** ఉండాలని కోరుకునేవాడు ఎవడైన సరే, యేసువారిని ఉద్దేశిస్తూ చెప్పాడు. తన అనుచరుడుగా ఉండే ఈ సంబంధాన్నే యేసు మొదట అనుగ్రహించింది.

అనేకులు ఆయనకు స్నేహితులుగా ఉండాలని కోరుతారు. కాని అటువంటి అభీష్టం నిలబడదు. యేసు తనకు విధేయత చూపనివారెవరైనా సరే వారిని తన స్నేహితులుగా భావించడు. ఆయన ఒకసారి ఇలా చెప్పాడు:

> నేను మీ కాజ్ఞాపించు వాటిని చేసినయెడల, మీరు నా స్నేహితులై
> యుందురు (యోహాను 15:14).

అనేకులు ఆయనను వెంబడించక పోయిననూ ఆయన సోదరులుగా ఉండాలని ఇష్టపడుతుంటారు. కాని తిరిగి యేసు వారి అభీష్టాన్ని తీర్చలేదు. అతడు తనకు విధేయుడు కాని పక్షంలో అతనిని యేసు తన సోదరుడిగా ఎన్నటికి పరిగణించడు.

పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున **చేయువాడే** నా సహోదరుడు (మత్తయి 12:50)

ఆయనను వెంబడించకుండానే ఆయనతో పాటు పరలోకంలో ఉండాలని అనేకులు కోరుకుంటూ ఉంటారు. కాని యేసు అది అసాధ్యమని తెలియజేసాడు. ఎవరు విధేయత చూపిస్తారో వారు మాత్రమే వెళతారు.

"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21). ఎవరైతే తనను వెంబడించాలని కోరుకుంటారోవారు తమను తాము ఉపేక్షించుకుంటేనే తప్ప తనను వెంబడించలేరు అని యేసు తెలియజేస్తున్నాడు. వారు తమ కోర్కెలను ఆయన చిత్తానికి లోబడునట్లుగా మలచుకోవాలి. ***తనను తాను ఉపేక్షించుట మరియు లోబడుట అనునవి క్రీస్తును వెంబడించటంలో కావలసిన ప్రధానాంశములు***,"నీ సిలువను ఎత్తుకో" అన్న మాటకు అర్థం ఇది.

## రెండవ వాక్యం

యేసు చెప్పిన రెండవ వాక్యం మొదటి వాక్యాని కున్న అర్థాన్ని మరికాస్త విశదీకరించింది.

తన ప్రాణమునకు ప్రతిగా ఏమి ఇయ్యగలుగును? వ్యభిచారమును పాపమునుచేయు ఈ తరమువారిలో నన్ను గూర్చియు నామాటలను గూర్చియు సిగ్గుపడువాడెవడో, వానిని గూర్చి మనుష్యకుమారుడు తన తండ్రి మహిమగలవాడై పరిశుద్ధ దూతలతో కూడ వచ్చునప్పుడు సిగ్గుపడునని చెప్పెను (మార్కు 8:35).

ఇక్కడ యేసు ఇద్దరు వ్యక్తుల మధ్యవున్న తారతమ్యాన్ని చూపిస్తున్నాడు. మొదటివాక్యంలో కూడ వీరిద్దరి గురించి చెప్పబడింది. నన్నువెంబడింప గోరువాడు తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువ యెత్తికొని నన్నువెంబడించవలెను. వారిరువురి మధ్య ఉన్న తారతమ్యం ఏమిటంటే, ఒకడు యేసు నిమిత్తం మరియు సువార్త నిమిత్తం తన ప్రాణమును పోగొట్టుకొనువాడు మరియు రెండవవాడు తన ప్రాణమును రక్షించు కొనగోరువాడు. ఆ రెండిటి మధ్య ఉన్నసంబంధాన్ని గనుక మనం చూస్తే మొదటివాక్యంలో తనను తాను ఉపేక్షించుకొనని వాడు అని చెప్పబడినవ్యక్తికి, రెండవ వాక్యంలో తన ప్రాణాలు రక్షించు కొనగోరువాడు దానిని పోగొట్టుకొనును అని చెప్పబడుతున్న వ్యక్తికి అనగా ఈ రెండు వాక్యాలలోని వ్యక్తులకు పోలిక ఉంది. అదేవిధంగా మొదటి వాక్యంలో తనకుతాను ఉపేక్షించుకొనును అని చెప్పబడిన వ్యక్తికి రెండవవాక్యంలో తన ప్రాణాలు పోగొట్టుకొనువాడు తుదకు దానిని రక్షించుకొనును అని చెప్పబడిన వ్యక్తికి, అనగా ఈ ఇరువురికీ పోలికవుంది.

ఒక వ్యక్తి తన భౌతికపరమైన ప్రాణాలు ఒదులుకోవటం లేదా రక్షించు కోవటం

అన్న దానిగురించి యేసు ఇక్కడ చెప్పటం లేదు. ఈ లేఖనభాగంలో తర్వాత వచ్చే వాక్యం యేసు నిత్యజీవం పోగొట్టుకోవటం, లేదా పొందటం అన్న దాని గురించి చెబుతున్నాడని సూచిస్తున్నాయి. ఈ విషయాన్నే యేసు యోహాను 12:25లో చెబుతున్నాడు:

> తన ప్రాణమును ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును; ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవముకొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (యోహాను 12:25).

మొదటివాక్యంలో తనను తాను ఉపేక్షించుకొననివాడు అని చెప్పబడుతున్న వ్యక్తి మరియు రెండవ వాక్యంలో తన ప్రాణాలు రక్షించుకొనగోరువాడు అని చెప్పబడుతున్న వ్యక్తి ఇద్దరూ ఒక్కరే. ఒకడు తన ప్రాణాలు రక్షించుకోవటం అనగా తన జీవితానికి సంబంధించిన సొంత విషయాలను కాపాడుకోవటం, అన్నదానిని బట్టి మనం ఒక నిర్ణయానికి రావటం సహేతుకమైన విషయం.

దీనికి పూర్తిగా భిన్నంగా ఉన్న వ్యక్తి అనగా క్రీస్తు కొరకు మరియు సువార్త కొరకు తన ప్రాణాలు పోగొట్టుకొనడు అని చెప్పబడుతున్న వ్యక్తి గురించి మనం ఆలోచిస్తే ఇది పూర్తిగా అర్థమయి పోతుంది. ఇతడు తనను తాను ఉపేక్షించుకొని తన సిలువను ఎత్తుకొని తన సొంత కార్యకలాపాలను ఒదులుకొని క్రీస్తు యొక్క పనిని కొనసాగిస్తూ సువార్తను ప్రకటించాలన్న ఉద్దేశ్యంతోటే జీవిస్తుంటాడు. "ఇతడే తుదకు తన ప్రాణాలు కాపాడుకొనువాడు." ఏవ్యక్తైతే తన సంతోషము గురించి ఆలోచించక క్రీస్తును సంతోషపెట్టాలని కోరుకుంటాడో,అతడు తుదకు దేవుని రాజ్యంలో తాను ఎంతో సంతోషంగా ఉన్నట్లుగా కనుగొంటాడు. అదలా ఉండగా, తన సంతోషాన్ని కొరుకునేవాడు చివరకు నరకంలో తాను ఎంతో హీనమైన స్థితిలో ఉన్నట్లుగా కనుగొంటాడు. అక్కడ అతడు తన ఇష్టప్రకారం నడుచుకునే స్వేచ్ఛ లేకుండా ఎంతో నికృష్టమైన స్థితిలో ఉంటాడు.

## మూడు మరియు నాల్గవ వాక్యములు

ఇప్పుడు మూడు మరియు నాల్గవ వాక్యములగురించి ధ్యానిద్దాం:

> ఒకడు సర్వలోకమును సంపాందించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుటవానికేమి ప్రయోజనము? మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి ఇయ్యగలుగును? వ్యభిచారమును పాపమునుచేయు ఈ తరమువారిలో నన్ను గూర్చియు నామాటలను గూర్చియు సిగ్గుపడువాడెవడో, వానిని గూర్చి మనుష్యకుమారుడు తన తండ్రి మహిమగలవాడై పరిశుద్ధ దూతలతో కూడ వచ్చునప్పుడు సిగ్గుపడునని చెప్పెను. (మార్కు 8:36-37)

ఈ రెండువాక్యములలో చెప్పబడుచున్న వ్యక్తి ఎవరంటే తనను తాను ఉపేక్షించు కొననివాడు. తన ప్రాణమును రక్షించుకొనువాడు దానిని పోగొట్టు కొనును అని ఏ వ్యక్తి గురించైతే

చెప్పబడుతుందో ఆ వ్యక్తి కూడ ఇతడే. ఇతడు ఈ లోకము చూపించే ఆశల వెంట పరుగెత్తి చివరికి తన ప్రాణమును పోగొట్టు కొనును", అని ఆతని గురించి ఇప్పుడు చెప్పబడుతోంది. యేసు ఈ లోకం యొక్క విలువను ఇతని ప్రాణము యొక్క విలువతో పోలుస్తూ, అతని అవివేకాన్ని వెల్లడి చేస్తున్నాడు. నిజమే వాటి మధ్య ఏ పోలిక లేదు ఒక వ్యక్తి ఈ లోకంలోనిదంతా సంపాదించి ఉండవచ్చును. కాని దాని వల్ల కలిగే పర్యవసానం ఏమిటంటే, అతడు నరకంలో నిత్యమూ పడి ఉండవలసిందే. అతడు క్షమించరాని తప్పులు చేశాడు.

క్రీస్తు అనుచరులుగా ఉండుటకు ప్రజలు తమ్మును తాము ఉపేక్షించు కొనకుండా ఏది వీరిని ఆ ఉద్దేశ్యం నుంచి పక్కదోవపట్టిస్తోంది? అన్నది పరిశీలించటం ద్వార ఈ మూడు మరియు నాల్గవ వాక్యములనుంచి కూడ మనం కొంత పరిజ్ఞానమును సంపాదించవచ్చు అని చెప్పవచ్చు. తమసొంత ఆనందంకోసం ఈ లోకం ఇచ్చే సంతోషాన్ని పొందాలన్నది వారి కోరిక వారు తమ్మును తాము ప్రేమించుకుంటారు కనుక యేసును వెంబడించుటకు నిరాకరిస్తూ, పాప పంకిలమైన సుఖ సంతోషాలను ఆపేక్షిస్తుంటారు, కాని నిజమైన యేసు అనుచరులు ఆయన యందు వారికున్న ఎనలేని ప్రేమ మరియు విధేయత వలన ఇటువంటి చెడు క్రియలను ద్వేషిస్తారు. ఆయనను వెంబడించనివారు ఈలోక సంబంధమైన ధనం, అధికారం మరియు కీర్తి ప్రతిష్టలను పొందాలన్న తాపత్రయంతో వాటికోసం ప్రయత్నిస్తుంటారు, అదేనిజమైన క్రీస్తు అనుచరులైతే ఆయన నీతిని మరియు రాజ్యాన్ని మొదట వారు వెతుకుతారు. వారు పొందిన ధనం, అధికారం లేదా ప్రతిష్టత ఏదైనసరే అది దేవుని యొద్ద నుండే వచ్చినవి అని భావించి అవి ఆయన మహిమార్థమునకే వాడుతారు.

## ఐదవ వాక్యం

తుదకు ఈ భాగంలోని చివరి ఐదవ వాక్యంలోనికి వచ్చాము:

> వ్యభిచారమును పాపమునుచేయు ఈ తరమువారిలో నన్ను గూర్చియు నామాటలనుగూర్చియు సిగ్గుపడువాడెవడో, వానిని గూర్చి మనుష్య కుమారుడు తన తండ్రి మహిమగలవాడై పరిశుద్ధ దూతలతో కూడ వచ్చునప్పుడు సిగ్గుపడునని చెప్పెను (మార్కు 8:38).

తిరిగి తనను తాను ఉపేక్షించుకోని వ్యక్తి గురించే ఇక్కడ చెప్పబడుతోంది. అతడు తన సొంత కార్యకలాపాల మీద దృష్టియుంచి, ఈ లోకసంబంధమైనవాటిని వెతుకుతూఉంటాడు. కావున తుదకు అతడు తన ప్రాణములను పోగొట్టుకుంటాడు. అతడు క్రీస్తును గూర్చియు మరియు ఆయన మాటలను గూర్చియు సిగ్గుపడు వానిగా వర్ణించబడుతున్నాడు. అతని సిగ్గు బహుశా అతని కున్న అవిశ్వాసము నుండి పుట్టుచున్నది అనుకుంటాను. యేసు దేవుని కుమారుడని అతడు నిజంగా విశ్వాసించినట్లైతే, అతడు ఖచ్చితంగా ఆయనను గూర్చి మరియు ఆయన మాటలను గూర్చి సిగ్గుపడిఉండేవాడు కాడు, కాని అతడు వ్యభిచారము పాపమును చేయు ఈ తరమువారిలో ఒకడైఉన్నాడు. కావున యేసు

తిరిగి వచ్చినప్పుడు అతనిని గూర్చి సిగ్గుపడును. ఇక్కడ ఒక రక్షింపబడిన వ్యక్తి గురించి యేసు వర్ణించటంలేదని స్పష్టంగా అర్థమవుతోంది.

వీటన్నిటిని గూర్చి తుదకు తేలిన విషయమేమిటి? ఈ లేఖన భాగమంతట అప్పటికే పరలోక మార్గంలో ఉంటున్న వారిని ఉద్దేశిస్తు సంపూర్ణ సమర్పణ జీవితము కొరకై ఇస్తున్న పిలుపుగా పరిగణించలేము. ఇది నిజముగా రక్షింపబడినవారికి మరియు రక్షణ పొందనివారికి మధ్యఉన్న తారతమ్యాలను స్పష్టంగావెల్లడిచేస్తున్నది. నిజంగా రక్షింపబడినవారు ప్రభువైన యేసు క్రీస్తును విశ్వసిస్తారు, కనుక ఆయన నిమిత్తం తమ్మునుతాము ఉపేక్షించుకుంటారు. ఇలాఉండగా, రక్షింపబడనివారు అటువంటి సమర్పణతోకూడిన విశ్వాసాన్ని చూపలేరు.

## సమర్పణకు మరియొక పిలుపు

మనం ఆలోచించగల్గితే ఇటువంటి పిలుపులు బైబిలులో ఇంకా ఎన్నో ఉన్నాయి, అయితే ఇప్పుడు సమర్పణ నిమిత్తమై యేసు ఇస్తున్న మరియొక పిలుపు చూద్దాం, అది రక్షణ కొరకైన పిలుపే తప్ప మరొకటి కాదు.

> "ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వీకుడను దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి (మత్తయి 11:28-30).

సువార్తికులు తాము సువార్త సంబంధమైన పిలుపును ఇస్తున్నప్పుడు సాధారణంగా ఈ లేఖన భాగాన్ని వాడుతుంటారు. (అదిమంచిదే) ఈ మాటలు రక్షణ నిమిత్తం ఇచ్చే ఒక స్పష్టమైన పిలుపువంటివి అన్నమాట. ఇక్కడ చూస్తే "ప్రయాసపడి భారంమోస్తున్న" వారికి యేసు విశ్రాంతిని అనుగ్రహిస్తున్నాడు. ఆయన ***శారీరక*** సంబంధమైన భారంమోస్తున్న వారికి, ***శారీరక*** సంబంధమైన విశ్రాంతిని ఇవ్వటంలేదు, కానీ ***వారి ఆత్మలకు విశ్రాంతిని*** అనుగ్రహిస్తున్నాడు. రక్షింపబడనివారు తమ అపరాధములతోను, భయముతోను , పాపముతోను కృంగిపోయి, వాటివలన అలిసిపోయినట్లుగా భావిస్తుంటే అప్పుడు వారు రక్షణ పొందుటకు తగినవారు అవుతారు.

అటువంటి ప్రజలు యేసు అనుగ్రహించే విశ్రాంతిని పొందు కోవాలని అనుకుంటూఉంటే వారు ఆయన చెప్పిన ప్రకారం రెండు పనులను చేయవలసిఉంటుంది. 1. ఆయన యొద్దకు రావాలి 2. ఆయన కాడిని వారిమీద ఉంచుకోవాలి.

"యేసు కాడిని తీసుకోవటం" అన్న విషయం గురించి తప్పుడు బోధకులు అప్పుడప్పుడు దాని యొక్క అర్థాన్ని మారుస్తూఉంటారు. కొందరు యేసు తన మెడమీద ఉన్న కాడి గురించి మాట్లాడుతున్నాడు అని వాదిస్తుంటారు. అందుచేతనే ఆయన దీనిని "నా

కాడి" అని పిలుస్తున్నాడు. ఒక సగం ఆయన మెడమీద మరియొక సగం ఖాళీగ ఉన్న ఆకాడిని మన మీదికి తీసుకునేందుకు ఎదురు చూస్తూ యేసు **రెండు కాడుల** గురించి మాట్లాడుతూ ఉన్నాడు అని వారు చెబుతూంటారు. మనం ఏమని అర్థంచేసుకోవాలంటే యేసు నాగలిని లాగుతానని వాగ్దానం చేస్తున్నాడు. ఎందుకంటే ఆయన కాడి సులువైనది, ఆయన భారం తేలికైనదని చెబుతున్నాడు గనుక. అటువంటి బోధకుల ప్రకారం మనం చేయవలసిందల్లా ఏమిటంటే మన జీవితాల్లో రక్షణ కార్యాన్ని చేయటానికి అనుమతిస్తూ ఆయన కృపద్వార లభ్యమయ్యే మేళ్ళను అనుభవిస్తూ, ఆయనలో విశ్వాసం ద్వార మనం జత చేయబడివున్నామా లేదా అన్నది పరిశీలించుకోవటం మాత్రమేనని వారు ప్రబోధిస్తుంటారు. వారి అభిప్రాయాన్ని మనపై రుద్దుతుంటారు.

కాని ఇది అలా కాదు, ప్రయాసపడుతున్నవారు తమ కాడిని ఎత్తుకొమ్మని యేసు చెబుతున్న మాటకు అర్థం వారు ఆయనను తమ జీవితాలను నిర్దేషించే ప్రభువుగా భావించి ఆయనకు లోబడి ఉండాలని అర్థం. అందుకనే మనము ఆయన కాడి తీసుకొని, అటుపిమ్మట ఆయన గురించి తెలుసుకోవాలని యేసు చెబుతున్నాడు. రక్షింపబడని వారు, తమ జీవితాలను వారే ఏలుకుంటూ, తమ ఇష్టప్రకారం జీవించే అడవి దున్నవంటివారు. వారు యేసు కాడిని తీసుకున్నట్లైతే వారి జీవితాల మీద వారికున్న అధికారాన్ని యేసుకు అప్పగించుతారు.

యేసుకాడి సుళువుగాను మరియు ఆయన భారం తేలికగాను ఉండటానికి గల కారణం ఏమిటంటే, మనలో నివసించు ఆయన పరిశుద్ధాత్మ ద్వార ఆయనకు లోబడునట్లుగా ఆయన మనకు శక్తినిస్తున్నాడు కనుక, ఈ లేఖనంలో తనను ప్రభువుగా భావించి తనకు లోబడమని ప్రజలకు యేసు రక్షణనిమిత్తమై ఇచ్చే పిలుపును మనం చూస్తున్నాము. ఈ విషయంలో రక్షణ అనునది అలిసిపోయినవారికి ఇచ్చే విశ్రాంతిగా చూపబడుతోంది.

## సారాంశము

ఇదంతా చెబుతున్నది దేనికంటే, విజయం సాధించిన ఒకనిజమైన దైవసేవకుడు శిష్యులను చేయుమని చెప్పిన యేసు ఆజ్ఞను శిరసావహిస్తాడు, మరియు మారుమనస్సు, సమర్పణ, శిష్యత్వం అనునవి పరలోకం వెళ్ళే విశ్వాసులు తమ ఇష్టపూర్వకంగా తీసుకునే నిర్ణయాలు కావని అతనికి తెలుసు. వాస్తవంగా అవి రక్షించే విశ్వాసం గూర్చిన సిసలైన వ్యక్తీకరణము, కాబట్టి ఒక విజయవంతమైన సేవకుడు రక్షింపబడని వారికి బైబిలు ఆధారిత సువార్తనే బోధిస్తాడు. అతడు మారుమనస్సుపొంది, యేసును వెంబడించుమని నశించినవారికి చెబుతూఉంటాడు, మరియు సమర్పించుకొనని వారికి వారి యొక్క రక్షణ విషయమై నమ్మకంచేకూర్చడు.

